వ్యవసాయ సంక్షోభం, సంబంధిత అంశాల పై తక్షణం పార్లమెంట్ ప్రత్యేక సంయుక్త సమావేశం ఏర్పాటు చేయవలసిందిగా విజ్ఞప్తి.

గౌరవనీయులైన శ్రీ రామ్ నాథ్ కోవింద్ గారికి,

మన దేశంలో నానాటికీ పెరిగి, దేశం యావత్తుకూ వ్యాపించిన వ్యవసాయ సంక్షోభాన్ని మీ దృష్టికి తీసుకువచ్చే లక్ష్యంతో మీకు ఈ లేఖ రాస్తున్నాం. దేశం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ఆందోళన, ఆలోచన కలిగిన పౌరులుగా మేము మీకు ఈ లేఖ రాస్తున్నాం. వ్యవసాయ సంక్షోభం అంటే ఇక కేవలం భూములు, ఆదాయాలు, ఉద్యోగాలు, ఉత్పాదకత నష్టం కావడమే కాదు. మన మానవత్వమే ఆవిరైపోయినట్లు.

మన గ్రామీణ ప్రాంతాలు నాశనమై, రైతులు అనాథలుగా మారిపోవడాన్ని చూస్తూ వచ్చిన ప్రభుత్వాలు, వారి కష్టాలు తీర్చేందుకు ఎటువంటి చర్య తీసుకోలేదు. సర్వం కోల్పోయిన వారి కష్టాలు, గత ఇరవై ఏళ్ళల్లో మూడు లక్షల మందికి పైగా రైతులు చివరకి ఆత్మహత్యలు చేసుకోవడాన్ని ప్రభుత్వాలు చూస్తూనే ఉన్నాయి. దేశంలో సుమారు 200 రైతు సంస్థలకూ, కోట్లాది మంది రైతులకు, వ్యవసాయ కార్మికులకు, కూలీలకు ప్రాతినిధ్యం వహిస్తూ, వారి జీవనోపాధి కాపాడేందుకు ప్రయత్నిస్తున్న అఖిల భారత రైతు పోరాట సమన్వయ సంఘం (AIKSCC) నవంబర్ 3 నుంచి 28వ తేదీ వరకు ఢిల్లీకి మూడు రోజుల కిసాన్ ముక్తి మోర్చా నిర్వహిస్తున్న దృష్ట్యా, కేవలం వ్యవసాయ సంక్షోభం, సంబంధిత అంశాలను మాత్రమే చర్చించేందుకు 21 రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక, సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలన్న వారి డిమాండ్ పట్ల దృష్టి సారించాలని మిమ్మల్ని కోరుతున్నాం.

భారత గణతంత్ర దేశ రాష్ట్రపతిగా, రాజ్యాంగ అధిపతిగా మీరు జోక్యం చేసుకుని, మన దేశంలో డెభై శాతం మంది పౌరులకు విఘాతం కలిగిస్తున్న ఈ పెను సమస్య గురించి పార్లమెంట్ సంయుక్త సమావేశంలో చర్చించేలా చూడాలని మా విజ్ఞప్తి. ఇటీవలి కాలంలో వస్తు, సేవల పన్ను గురించి చర్చించేందుకు అర్ధరాత్రి పార్లమెంట్ సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. అదే విధంగా, కోట్లాది

మంది పౌరుల జీవితాలను అస్తవ్యస్తం చేసి, ప్రమాదంలో పడేస్తున్న పడేస్తున్న పరిస్థితి పైన పార్లమెంట్ పూర్తి ఏకాగ్రతతో దృష్టి కేంద్రీకరించాలనీ, ఆ చర్చ ద్వారా శాశ్వత పరిష్కారాలు కనుగొనే ప్రయత్నం చేయడం సబబే కదా! మన దేశంలో రైతులు, కార్మికులు, అటవీ తెగలు, మత్స్యకారులు, సాక్షరత, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల నిర్వహణలో కీలక భాగమైన అంగన్వాడి కార్యకర్తలు, సామాజిక ఆరోగ్య కార్యకర్తలు, ఏ ఎన్ ఎంలు మొదలైనవారు అసంఖ్యాకమైన సార్లు నిరసనలు, పిటీషన్లు, విజ్ఞప్తులు, వినతులు చేసినా ప్రభుత్వాల దృష్టి వ్యవసాయ సంక్షోభంపై పడేలా చేయడంలో విఫలమైన తర్వాత మాత్రమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశం కోరుతున్న విషయాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నాం.

గ్రామీణ భారతీయులు సామాజిక ఆర్థిక న్యాయం కోరడం అంటే, రుణాల నుంచి విముక్తి, గిట్టుబాటు ధరలు, న్యాయమైన వేతనం, ఉపాధి, విద్య, ఆరోగ్యం, పోషణ భద్రత కోరడమేనని మీరు గుర్తించారని విశ్వసిస్తున్నాం. AIKSCC తరఫున రెండు బిల్లులు – రైతుల రుణ విముక్తి బిల్, 2018, వ్యవసాయ ఉత్పత్తులకు తప్పనిసరి గిట్టుబాటు కనీస మద్దతు ధర బిల్, 2018, ఇప్పటికే పార్లమెంట్ లో చర్చ కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ బిల్లులను ఆమోదించడం అనేది కూడా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఒక ముఖ్యమైన భాగం కావాలి.

సమానత్వ సాధనకు కృషి చేయాలని చెప్పే మన రాజ్యాంగంలో సూత్రాలను అనుసరించి మీరు ఈ ప్రత్యేక వ్యవసాయ సమావేశాల డిమాండ్ కి బేషరతుగా మద్దతు ఇస్తారని ఆశిస్తున్నాం. మన దేశంలో గ్రామీణ ప్రాంతాలను ధ్వంసం చేస్తున్న ఈ వ్యవసాయ సంక్షోభానికి మద్దతుగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు మన ప్రజాస్వామ్యానికి అతి పెద్ద అభివ్యక్తీకరణ అవుతుంది. మన రాజ్యాంగంలో విలువలను మనం ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు కాపాడతారన్న ప్రజల విశ్వాసాన్ని ఇది మరింతమరింత పటిష్టం చేస్తుంది.

గ్రామీణ భారతమనేది ఈ భూతలంలోనే అత్యంత సంక్లిష్టమైన భాగాల్లో ఒకటని మేము మీకు చెప్పనవసరం లేదు. ఈ ప్రత్యేక సమావేశం మన గ్రామీణ ప్రాంతాలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యల పైన తప్పనిసరిగా అవగాహన కల్పిస్తుంది.  రైతు ఆత్మహత్యలు, పిల్లల ఆకలి మరణాలు, పెరుగుతున్న నిరుద్యోగం, అవ్యవస్థీకృతత, రుణభారం, పశు అర్ధ వ్యవస్థ నాశనం,

మొత్తం మీద నెలకొన్న ఒక అనిశ్చితి మన వ్యవసాయరంగం కుప్పకూలేలా చేశాయి. దీని ఫలితంగా, ఒకప్పుడు మన ఆహారాన్ని సగర్వంగా ఉత్పత్తి చేసినవారు, ఈ నాడు పని మనుషులుగా, రోజు కూలీలుగా పని చేస్తూ శ్రమ దోపిడీకి గురౌతున్నారు. 1991తో పోలిస్తే దాదాపు కోటిన్నర మంది రైతులు తగ్గిపోయారని 2011 జనాభా లెక్కల్లోనే వెల్లడైంది. ఈ రకంగా సంకట స్థితిలో వలసలు క్రమం తప్పకుండా జరగడం అంటే వ్యవసాయ సంక్షోభం గ్రామీణ భారతం ఎల్లలు దాటి విస్తరించిందనీ, మన ఆహార భద్రతా, మన సమిష్టి ఆహార సార్వభౌమాధికారాన్ని దెబ్బ తీస్తోందని గమనించాలి.

వ్యవసాయ సంక్షోభంపై ఈ ప్రత్యేక సమావేశంలో చర్చ బాధితుల కథనాలు, వాంగ్మూలాల ఆధారంగా జరిగేలా మీరు జోక్యం చేసుకోవాలని కూడా మేము కోరుతున్నాం. పార్లమెంట్ గోడల లోపల ఈ వాంగ్మూలాలు వినిపించాలి. ఈ సమావేశాల వల్ల రైతులు చట్ట సభలో నుంచి తమ తోటి పౌరులకు, ప్రజా ప్రతినిధులకు వ్యవసాయ విధానాల వల్ల తీవ్ర ప్రభావం, గ్రామీణ రుణ వ్యవస్థ లేకపోవడం, నీరు, ఆరోగ్యం, విద్య ప్రైవేటుపరం చేయడం వల్ల తాము ఎదుర్కొంటున్న భరించలేని హింస గురించి నేరుగా వివరించగలుగుతారు. 2006 జాతీయ రైతుల కమీషన్ చేసిన సిఫారసులు, మహిళా రైతుల హక్కుల బిల్లు వంటివి సరైన దిశలో సమగ్రమైన చర్యలు అయినా కూడా సరైన పద్ధతిలో అమలు కాకపోవడం వల్ల ఏ విధంగా నష్టం జరిగిందో వివరిస్తారు. గ్రామీణ అర్థ వ్యవస్థకు మూల స్తంభమైన మహిళా రైతుల శ్రమను అనేక దశాబ్దాలుగా గుర్తించకపోవడాన్ని పార్లమెంట్ సమావేశం ప్రత్యేకంగా చర్చించేలా మీరు చూడాలని మేము కోరుతున్నాం. భూమి లేని రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, దళిత, ఆదివాసీ రైతులు, అనుబంధ వృత్తుల్లో ఉన్న అల్పసంఖ్యాక వర్గాల వారి సమస్యల గురించి ఆలకించి, నమోదు చేసుకుని, ఈ సమావేశాల్లో పరిష్కారాలు సాధించాలని కూడా మేము కోరుతున్నాం.

2018 మార్చి మాసంలో మహారాష్ట్రకి చెందిన దాదాపు నలభై వేల మంది రైతులు నాశిక్ నుంచి కిసాన్ లాంగ్ మార్చ్ చేసి ముంబై లో రాష్ట్ర శాసన సభ భవనాన్ని తమ డిమాండ్ల పరిష్కారం కోసం చుట్టుముట్టారు. ప్రజాస్వామ్యంలో పౌరులుగా తమ నిరసనను శాంతియుతంగా వ్యక్తం చేశారు. AIKSCC ఆధ్వర్యంలో నవంబర్ మాసంలో ఢిల్లీకి లాంగ్ మార్చ్ అనంతరం, రాజ్యాంగ

వ్యవస్థలో అత్యున్నత పదవిని అలంకరించిన మీరు, మన జాతి ప్రజాస్వామ్య యంత్రాంగాలలో ఒకటైన పార్లమెంట్ ని రైతులు కోరుతున్నదేమితో అర్థం చేసుకుని, ఆలకిస్తారని ఆశిస్తున్నాం. ఎందుకంటే, ఈ రైతులే మన దేశ ప్రజలకు రక్షకులు. వారే ప్రజాస్వామ్యాన్ని నిలబెడుతున్నవారు.

సగౌరవంగా

సంతకం/-

భారతీయ పౌరులు